

పర్మినెంట్ చేయకుంటే సమ్మెలోకి...

- విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల పోరాట కమిటీ హెచ్చరిక
- మాజీ ఎంపీ మధు సహా 26 మంది అరెస్టు, విడుదల
- లాఠీఛార్జీ చేసి చెదరగొట్టే ప్రయత్నంలో పోలీసులు విఫలం
- తిరుపతి డిస్కం ఎదుట కార్మికుల మహాధర్నా సక్సెస్





వేలాదిగా పాల్గొన్న విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు , మాజీ ఎంపి మధును అరెస్టు చేస్తున్న పోలీసులు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ

'నెలలు కాదు... సంవత్సరాలు కాదు... నాలుగేళ్లు చూశాం.. మీ నిర్లక్ష్యాన్ని ఇంకా సహించలేం.. సహనానికీ ఓ హద్దు ఉంటుంది.. అధికారంలోకి వచ్చిన వెంటనే విద్యుత్ కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేస్తామని, కనీస వేతనం ఇస్తామని మీరే చెప్పారు.. తీరా దశలవారీ ఆందోళనలు చేసినా, అర్జీలు ఇచ్చినా ఫలితం లేకపోయింది.. సోమవారం డిస్కం పరిధిలో భారీ ధర్నాకు పిలుపునిస్తే కార్మికులను భయపెట్టి చెదరగొట్టాలని చూశారు.. సాధ్యం కాలేదు.. పర్మినెంట్ చేసి కనీస వేతనం ఇవ్వకుంటే ఈనెల 10 నుంచి సమ్మెలోకి వెళతాం' అని విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల పోరాట కమిటీ హెచ్చరించింది. కదం తొక్కిన విద్యుత్ కాంట్రాక్టు కార్మికులతో తిరుపతి లక్ష్మీపురం సర్కిల్ రణరంగంగా మారింది.. సిపిఎం మాజీ ఎంపి పెనుమల్లి మధు, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి సహా 26 మందిని అరెస్టు చేసి, అనంతరం విడుదల చేశారు. ఉద్యమాన్ని చెదరగొట్టేందుకు కార్మికులపై లాఠీఛార్జి చేయడంతో కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. వివరాలిలా ఉన్నాయి.

సిఎం హామీ మేరకు విద్యుత్ కాంట్రాక్టు కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని, 45 శాతం ఫిట్మెంట్, మూడు వెయిటేజీలతో కూడిన పిఆర్సిని శాశ్వత ఉద్యోగులకు ఇవ్వాలని, పాత పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని, కారుణ్యనియామకాల్లో అడ్డగోలు నిబంధనలను రద్దు చేయాలని, 2022 ఆధారంగా పిఆర్సి వేతనాలు కార్మికులకు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సోమవారం విద్యుత్ కార్మికులు మహాధర్నా చేపట్టారు. డిస్కం పరిధిలోని జిల్లాల నుంచి వేలాదిమంది విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో తిరుపతికి చేరుకున్నారు. ధర్నాను విఫలం చేయడానికి పోలీసులు ఆదివారం సాయంత్రం నుంచే కార్మికులను అరెస్టులు చేయడం, నిర్బంధంలోకి తీసుకోవడం, నోటీసులు ఇవ్వడం, కార్యక్రమానికి రావద్దంటూ బెదిరించడం చేస్తూ వచ్చారు. ఇవేమీ లక్ష్యపెట్టని కార్మికులు పెద్ద సంఖ్యలో తిరుపతి పట్టణానికి చేరుకున్నారు. లక్ష్మీపురం సర్కిల్ వద్ద కనబడిన విద్యుత్ కార్మికులందరినీ ఉదయం నుంచే అరెస్టులు చేయడం ప్రారంభించారు. విద్యుత్ కార్మికులకు మద్దతు ప్రకటించడానికి విచ్చేసిన సిపిఎం మాజీ రాజ్యసభ సభ్యులు పెనుమల్లి మధు, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి, తిరుపతి నగర కార్యదర్శి వేణుగోపాల్‌లను లక్ష్మీపురం సర్కిల్ పెట్రోల్ బంక్ వద్ద అదుపులోకి తీసుకోడానికి ప్రయత్నించారు. బలవంతంగా నేతలను అరెస్టు చేసి ఈస్టు పోలీసు స్టేషన్‌కు తరలించారు. దీంతో కార్మికులు ఆగ్రహంతో లక్ష్మీపురం సర్కిల్ వద్దకు ఎర్రజెండాలతో చేరుకున్నారు. పదుల సంఖ్యలో ఉన్న పోలీసులు వేల సంఖ్యలో ఉన్న కార్మికులను కట్టడి చేయలేక చేతులెత్తేశారు. లాఠీఛార్జీ చేయడానికి ప్రయత్నించినా కార్మికులను నిలువరించలేకపోయారు. వేలాదిగా వచ్చిన కార్మికులు ప్రదర్శనగా ఎస్‌పిడిసిఎల్ కార్యాలయం వద్దకు భారీ ప్రదర్శనగా విచ్చేశారు. దాదాపు రెండు గంటల పాటు ధర్నా సాగింది.

విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల పోరాట కమిటీ చైర్మన్ సుదర్శన్ రెడ్డి ప్రసంగిస్తూ ఎన్నికలకు ముందు జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. ముందస్తు అనుమతి తీసుకున్నప్పటికీ పోలీసులు చేసిన ఓవరాక్షన్ అప్రజాస్వామికంగా ఉందని ఆయన విమర్శించారు. పోలీసు నిర్బంధాలతో ఉద్యమాలు ఆగిపోవడానికి ఇది బోగస్ జేఏసీ కాదని... పోరాట కమిటీ అని ఆయన అన్నారు. కమిటీ కార్యదర్శి శివయ్య మాట్లాడుతూ తక్షణం రాష్ట్ర ప్రభుత్వం తమ సమస్యల్ని పరిష్కరించకుంటే ఆగస్టు పది నుంచి నిరవధిక సమ్మె తప్పదని హెచ్చరించారు. తాము చేపట్టబోయే నిరోధక సమ్మె కారణంగా విద్యుత్ వినియోగదారులకు అసౌకర్యం కలిగితే ప్రభుత్వమే బాధ్యత వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు బాలకాశి, కట్టా నాగరాజు, గంగయ్య, చంద్రశేఖర్, డిస్కం స్థాయి నేతలు ఎన్ శివశంకర్, బ్రహ్మానందరెడ్డి, రామలింగారెడ్డి తదితరులతోపాటు నాయబ్ రసూల్, శ్రీనివాసులు, కిరణ్ మణి, టి.కుమార్ పాల్గొన్నారు.

అప్రజాస్వామిక విధానాలు విడనాడాలి: మాజీ ఎంపీ మధు


ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను అమలుపరచకుండా జాప్యం చేయడమే కాకుండా హామీలను అమలు చేయమన్న నేరానికి కార్మికులపై నిర్బంధానికి పాల్పడడం, సంఘీభావం తెలియజేయాలని వచ్చిన తమలాంటి వాళ్ళను అరెస్టులు చేసి గంటల తరబడి పోలీస్ స్టేషన్లో నిర్బంధించడం దారుణమని విమర్శించారు తూర్పు పోలీస్ స్టేషన్లో తమతో పాటు 26 మంది కార్మికులు అరెస్టయ్యారని తెలిపారు. తక్షణం నిర్బంధాన్ని మానుకొని విద్యుత్ కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్నం ఒంటిగంట వరకు మధు, కందారపు మురళితో పాటు పలువురు కార్మికులను నిర్బంధించారు. విద్యుత్ కార్మికుల పోరాటానికి ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి రాధాకష్ణ, సిఐటియ జిల్లా నేతలు టి. సుబ్రమణ్యం, వేణుగోపాల్, రామకష్ణ తదితర నేతలతో కలిసి ధర్నాలో పాల్గొని మద్దతు ప్రకటించారు.

అధికారులతో చర్చలు జరిపిన విద్యుత్ నేతలు

ధర్నా సందర్భంగా డిస్కం అధికారులు పోరాట కమిటీ నేతలను ఆహ్వానించి చర్చలు జరిపారు. కమిటీ ప్రతిపాదిస్తున్న పలు అంశాలను రాష్ట్ర ప్రభుత్వం దష్టికి తీసుకెళ్తామని అధికారులు వెల్లడించారు. అనంతరం విద్యుత్ పోరాట కమిటీ నేతలు ధర్నాను విరమించారు.

సామాన్యుల సేవే సంతృప్తినిచ్చింది : వైవి సుబ్బారెడ్డి

పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు



విరాళాన్ని అందుకుంటున్న టిటిడి పాలకమండలి సభ్యులు



ప్రజాశక్తి - తిరుమల: తిరుమల తిరుపతి దేవస్థానముల ధర్మకర్తల మండలి అధ్యక్షునిగా తాను పనిచేసిన నాలుగేళ్లలో ఎక్కువమంది సామాన్య భక్తులకు శ్రీ వేంకటేశ్వరస్వామివారి దర్శనం కల్పించేందుకు ఎల్1, ఎల్2, ఎల్3 టికెట్లు రద్దు చేయడం, సామాన్యులకు స్వామివారి తొలి దర్శనం కల్పించేందుకు విఐపి బ్రేక్ సమయాన్ని మార్చుతూ తీసుకున్న నిర్ణయాలు అత్యంత సంతప్తినిచ్చాయని టీటీడీ ఛైర్మన్ వైవి.సుబ్బారెడ్డి చెప్పారు. టీటీడీ ధర్మకర్తల మండలి చివరి సమావేశం సోమవారం తిరుమల అన్నమయ్య భవనంలో ఛైర్మన్ వైవి.సుబ్బారెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా అధికారులు ఛైర్మన్ నాలుగేళ్ల పదవీకాలంలో తీసుకున్న ముఖ్యమైన నిర్ణయాలకు సంబంధించిన పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. అనంతరం శ్రీ వైవి.సుబ్బారెడ్డి మీడియాకు బోర్డు నిర్ణయాలను వెల్లడించారు.

- రూ.4 కోట్లతో అలిపిరి కాలిబాట మార్గంలోని మొదటి ఘాట్ రోడ్డులో మోకాలిమెట్టు నుండి శ్రీ లక్ష్మీ నరసింహస్వామివారి ఆలయం వరకు మిగిలి ఉన్న ప్రదేశంలో ఫుట్‌పాత్ షెల్టర్ల నిర్మాణం.
- రూ.2.20 కోట్లతో తిరుమలలోని ఔటర్ రింగ్ రోడ్డులో విద్యుత్ బస్సుల కోసం ఛార్జింగ్ స్టేషన్ ఏర్పాటు.
- రూ.2.50 కోట్లతో తిరుమలలోని పిఏసి-1లో అభివద్ధి పనులు.
- రూ.24 కోట్లతో రెండు ఘాట్ రోడ్లలో రక్షణ గోడల నిర్మాణం.
- ఎస్వీ ఆయుర్వేద ఆసుపత్రిలో 11.50 కోట్లతో అదనపు అంతస్తు నిర్మాణం, 2.60 కోట్లతో గ్రౌండ్ ఫ్లోర్ అభివద్ధి పనులు, 3 కోట్లతో ఆయుర్వేద కళాశాల విద్యార్థినుల హాస్టల్ భవనంలో అదనంగా మరో రెండు అంతస్తుల నిర్మాణం.
- 2.20 కోట్లతో తిరుపతిలోని రుయా ఆసుపత్రిలో నూతన టిబిసిడి వార్డు నిర్మాణం.
- 11 కోట్లతో ఎస్వీ సంగీత కళాశాల, ఎస్వీ నాదస్వర పాఠశాలలో చదువుతున్న బాలురకు హాస్టల్ భవనం నిర్మాణం.
- 1.25 కోట్లతో దేశవ్యాప్తంగా ఉన్న రక్షణ లేని 69 టీటీడీ భూములకు కంచె నిర్మాణం.
- టీటీడీ ఆస్థాన విద్వాంసులుగా గరిమెళ్ల బాలకష్ణప్రసాద్‌ను మరో మూడేళ్ల పాటు నియామకం.

ఈ మీడియా సమావేశంలో తిరుపతి శాసనసభ్యులు, టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యులు భూమన కరుణాకర్‌రెడ్డి, పోకల అశోక్‌కుమార్, బుర్రా మధుసూదన్ యాదవ్, మూరంశెట్టి రాములు, కాటసాని రాంభూపాల్‌రెడ్డి, ఈవో ఎవి.ధర్మారెడ్డి, జెఈవో వీరబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

ఈ మీడియా సమావేశంలో తిరుపతి శాసనసభ్యులు, టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యులు భూమన కరుణాకర్‌రెడ్డి, పోకల అశోక్‌కుమార్, బుర్రా మధుసూదన్ యాదవ్ పాల్గొన్నారు.

టీటీడీకి రూ.5.11 కోట్లు విరాళం

చెన్నై స్థానిక సలహామండలి అధ్యక్షుడు శేఖర్ రెడ్డి నేతత్వంలో తొమ్మిది మంది దాతలు కలిసి టీటీడీకి రూ.5.11 కోట్లు విరాళం అందించారు. దాతలు ఈ మొత్తానికి సంబంధించిన డీడీని సోమవారం తిరుమల అన్నమయ్య భవనంలో టీటీడీ ఛైర్మన్ వైవి.సుబ్బారెడ్డికి అందజేశారు.

మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని ధర్నా

వీఆర్ఏల రెండు రోజుల దీక్ష ప్రారంభం



తిరుపతిలో వీఆర్ఏల దీక్ష

ప్రజాశక్తి - తిరుచానూరు / సత్యవేడు : మున్సిపల్ కార్మికులను పర్మినెంట్‌చేస్తామని ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీని నెరవేర్చకుండా ముఖ్యమంత్రి జగన్ మాట తప్పారంటూ సిఐటియు జిల్లా అధ్యక్షులు బాలసుబ్రమణ్యం అన్నారు. కలెక్టరేట్ ఎదుట మున్సిపల్ కార్మికులు సోమవారం ధర్నా నిర్వహించారు. తమకు ఆప్కోస్‌లో కలపొద్దని, పర్మినెంట్ చేయాలని కార్మికులు, ఉద్యోగులు నిరసనలు చేపడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఏడు నెలలుగా వేతనాలు ఇవ్వకుండా పెండింగ్ పెట్టి ఇబ్బందులు పెడుతున్నారన్నారు. డిమాండ్లు పరిష్కరించకుంటే ఈనెల 17న చలో అమరావతి చేపడతామని హెచ్చరించారు. అనంతరం జేసీకి వినతిపత్రం సమర్పించారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పుల్లయ్య పాల్గొన్నారు.

సత్యవేడు ఎంపిడిఓ కార్యాలయం వద్ద గ్రీన్ అంబాసిడర్లు నిరసన దీక్ష చేపట్టారు. సిఐటియు డివిజన్ కార్యదర్శి ఎం.రమేష్ నాయకత్వంలో జరిగింది. వాలంటీర్లకు నెలనెలా ఐదువేలు ఇస్తున్న ఈ ప్రభుత్వం, గ్రీన్ అంబాసిడర్లకు నెలనెలా ఆరువేలు ఎందుకు ఇవ్వలేకపోతుందని ప్రశ్నించారు. కనీస వేతనం 20వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ అంబాసిడర్లు శేఖర్, సుబ్రమణ్యం, మునస్వామి, దానమ్మ, సంపూర్ణమ్మ పాల్గొన్నారు.



సత్యవేడులో గ్రీన్ అంబాసిడర్ల నిరసన

వీఆర్ఏల దీక్షలు ప్రారంభం

విఆర్ఎల సమస్యలు పరిష్కరించాలంటూ కలెక్టరేట్ ఎదుట నిరసన దీక్ష సోమవారం ప్రారంభమయ్యింది. సిఐటియు జిల్లా అధ్యక్షులు జి.బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ ప్రతిపక్ష నేతగా హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తరువాత విస్మరించారన్నారు. అర్హులందరికీ ప్రమోషన్లు ఇవ్వాలని డిమాండు చేశారు. గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు అంగేరి పుల్లయ్య మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి హయాంలో విఆర్ఎలకు ఒక్క రూపాయి కూడా పెంచి ఇవ్వలేదని, డిఎ రికవరీ ఆపాలని ఎన్నిసార్లు ప్రభుత్వానికి మొర పెట్టుకున్నా కనికరించలేదన్నారు. దీంతో రెండు రోజుల నిరసన దీక్ష చేపట్టారన్నారు. విఆర్ఎల జిల్లా అధ్యక్షులు గోవిందస్వామి, జిల్లా కార్యదర్శి సుబ్బయ్య, సిఐటియు నాయకులు వెంకటేష్, సురేష్, మునిరాజా, ఎపి మున్సిపల్ సంఘం నాయకులు గోపి, రాజగోపాల్, కస్తూరయ్య, హరి, శ్రీహరి, పోలయ్య, శివ, చెంగల్‌రాయులు, మురళి, మాధవయ్య, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఉద్యమాలకు ఊపిరి గద్దర్ పాట

ప్రజాశక్తి - తిరుపతి (మంగళం)

విప్లవ ప్రజా గాయకుడు గద్దర్‌కు జిల్లావ్యాప్తంగా నివాళి అర్పించారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ మాట్లాడుతూ పేదలపక్షపాతిగా విప్లవ భావాలతో 50 ఏళ్లపాటు పేదల అభ్యున్నతి కోసం పోరాడిన గొప్ప వ్యక్తి గద్దర్ అని కొనియాడారు. ఆయన మరణం ఆంధ్రరాష్ట్రానికే కాకుండా దేశానికే లోటని అన్నారు. ఈ కార్యక్రమంలో పూతలపట్టు ప్రభాకర్, యార్లపల్లి గోపి పాల్గొన్నారు. రాయలసీమ రంగస్థలి ఛైర్మన్ గోపీనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. గద్దర్ చిత్రపటానికి నివాళులు అర్పించిన వారిలో కార్యదర్శి కె.ఎన్.రాజా, టి సుబ్రమణ్యం రెడ్డి, కస్పా పద్మనాభం, కే .కేశవరెడ్డి శాంబోలు హరినాథ్, కే.సుబ్రహ్మణ్యం రెడ్డి ఉన్నారు



శ్రీకాళహస్తిలో గద్దర్‌కు నివాళి అర్పిస్తున్న అభిమానులు

శ్రీకాళహస్తిలో... అంబేద్కర్ భవన్‌లో గద్దర్ అభిమానులు, వామపక్ష పార్టీల నేతలు గద్దర్‌కు నివాళి అర్పించారు. గద్దర్ పాట కాలక్షేప సాధనం కాదని, శ్రమజీవుల ఆయుధం అని అన్నారు. సమాజాన్ని మార్చాలని కోరుకునే వ్యక్తుల్లో గద్దర్ ముందు వరుసలో నిలిచారన్నారు. తాత్విక భావజాలం నుంచి విముక్తి చేయడానికి గద్దర్ ఎంతో కృషి చేశారన్నారు. గద్దర్‌కు ఉమ్మడి చిత్తూరు జిల్లాతో విడదీయరాని అనుబంధం ఉందన్నారు. 90వ దశకంలో శ్రీకాళహస్తి పట్టణంలోని అయ్యలనాయుడు చెరువులో గద్దర్ సభ నిర్వహించారని గుర్తుచేశారు. 1980లో మదనపల్లిలోని బిటి s కళాశాలలో గద్దర్ నక్షల్బరీ ఒగ్గుకథ చెప్పే సమయంలో క్యాన్సర్‌కారణంగా నోటిలో రక్తం వచ్చినా లెక్కచేయకుండా ఒగ్గుకథ పూర్తి చేశారన్నారు. గద్దర్ పోరాట పటిమకు ఇది నిదర్శనమన్నారు. పుచ్చలపల్లి సుందరయ్య భవన్‌లో సిపిఎం నాయకులు గంధం కిషోర్, వలిపి శ్రీరాములు, గంధం మణి, పెనగడం గురవయ్య, షరీఫ్, సుదర్శన్, వెంకటేష్ ఆధ్వర్యంలో నివాళి అర్పించారు.

వెంకటగిరిలో... ప్రజానాట్యమండలి కళాకారులు వెంకటగిరిలో నివాళి అర్పించారు. క్రాస్‌రోడ్డు వద్ద గల డాక్టర్ అంబేద్కర్ విగ్రహం వద్ద గద్దర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో పంజాం ధనంజయ పాల్గొన్నారు.



తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో చింతామోహన్ ఆధ్వర్యంలో...

ఇంటిపట్టాలు ఇచ్చేవరకూ ఆందోళన : సిపిఎం



తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఆరో రోజూ దీక్ష

కెవిబిపురం : మండలంలోని కొత్తూరు దళిత, గిరిజన కాలనీలో అర్హులైన పేదలందరికీ ఇంటిస్థలాలు పంపిణీ చేసే వరకూ ఆందోళన కొనసాగుతుందని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దాసరి జనార్ధన్ అన్నారు. సోమవారం కెవిబిపురం తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆరో రోజూ దీక్ష కొనసాగింది. తిమ్మసముద్రం క్లస్టర్‌లో పనిచేస్తున్న విఆర్ఓ దళిత గిరిజనుల ఇళ్లస్థలాల కోసం పోరాటం చేస్తున్న మహిళల పట్ల దురుసుగా, అనుచితంగా ప్రవర్తిస్తున్నాడని తహశీల్దార్ శ్రీదేవికి వినతిపత్రం అందజేశారు. తహశీల్దార్ స్పందిస్తూ విఆర్ఓను తీవ్రస్థాయిలో మందలించి, తక్షణమే అర్హుల జాబితాను ఆన్‌లైన్‌లో నమోదు చేసి 90 రోజుల్లో ఇంటిపట్టాలివ్వాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ సుబ్రమణ్యం, సిపిఎం మండల కార్యదర్శి నాగరాజు, నాయకులు వరలక్ష్మి, కొత్తూరు ఇండ్ల స్థలాలపోరాట కమిటీ నాయకులు నీలావతి, కమల, ప్రమీల, వనజ, మమత, శిరీష, సుబ్బరత్నమ్మ, కుమారి, కవిత, శకుంతల, సేనమ్మ, సుమలత పాల్గొన్నారు.

'బిపి మండల్ డే'కు నివాళి

తిరుపతి టౌన్ : మండల్ డే సందర్భంగా బీసీ సంఘర్షణ సమితి ఆధ్వర్యంలో డిబిఆర్ రోడ్ లో ఉన్న తిరుపతి బీపీ మండల్ విగ్రహానికి సోమవారం పూలమాలవేసి ఘనంగా నివాళి అర్పించారు. మేయర్ డాక్టర్ శిరీష మాట్లాడుతూ బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించాలని దేశవ్యాప్తంగా కులగణన జరగాలని అనేక అంశాలు పొందుపరచడం జరిగింది. నేటికీ ఓబీసీలు తిరుగుబాటు చేస్తే తప్ప సమస్యలు పరిష్కార దశలో పాలకులు ఉండటం లేదన్నారు. రాబోయే పార్లమెంటు సమావేశాల్లో చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించే విధంగా బిల్లు పెట్టాలని కోరారు. బీసీ సంఘర్షణ సమితి అధ్యక్షులు అక్కెనపల్లి లక్ష్మయ్య, బివి కేశవులు, బుసగాని లక్ష్మయ్య యాదవ్, సాకం ప్రభాకర్ పాల్గొన్నాయి.

విద్యార్థులకు కంప్యూటరుపై అవగాహనే లక్ష్యం

తిరుపతి టౌన్ : విద్యార్థులకు కంప్యూటరుపై అవగాహన ఉండాలన్న లక్ష్యంతోనే కంప్యూటర్ లిటరసీ ప్రోగ్రాముల నిర్వహిస్తున్నామని ఎలక్ట్రోస్టీల్ కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి సురేష్ తెలిపారు. ఎలక్ట్రోస్టీల్ సీఎస్ఆర్ నిధులతో శ్రీకాళహస్తి రూరల్ తొండమనాడులోని జిల్లా పరిషత్ హై స్కూల్ లో 6 నుంచి 9వ తరగతి వరకు చదువుతున్న 257 మంది విద్యార్థులకు జూన్ 2022 నుంచి ఏప్రిల్ 2023 వరకు కంప్యూటర్ లిటరసీ ప్రోగ్రాములు నిర్వహించింది. ఈ కంప్యూటర్ లిటరసీ ప్రోగ్రామ్ ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు ప్రాక్టీసుకు ఉపయోగపడే విధంగా పాఠశాలలో కంప్యూటర్ మౌలిక సౌకర్యాలను కూడా ఏర్పాటు చేశామన్నారు. 257 మంది విద్యార్థుల్లో కంప్యూటర్ విద్యలో అసాధారణ ప్రతిభ కనబర్చిన 14 మంది విద్యార్థులకు బహుమతులు అందజేశామన్నారు. ఈ విద్యార్థులందరికీ కోర్స్ మెటీరియల్ ను ఇచ్చామన్నారు. ఈ ఏడాది కంప్యూటర్ లిటరసీ ప్రోగ్రాం రాచగున్నేరి గ్రామం జెడ్.పీ హైస్కూల్ లో 6 నుంచి 9వ తరగతి వరకు చదువుతున్న 110 మంది విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. సీనియర్ వైస్ ప్రెసిడెంట్-ఆపరేషన్స్ రాజీవ్ ప్రకాష్ మాట్లాడుతూ గ్రామీణ విద్యార్థులకు సాధికారత కల్పించేందుకు ఈ సీఎస్ఆర్ నిధులు వెచ్చిస్తున్నామని తెలిపారు. ఐఆర్ సీనియర్ జనరల్ మేనేజర్ దొరైరాజ్ మాట్లాడుతూ డిజిటల్ ప్రపంచంలోకి విజయవంతంగా ప్రయాణించే వీలు కలిగించడానికిగాను వారికి కంప్యూటర్ శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. ప్రాథమిక కంప్యూర్ నిర్వహణ, ఎంఎస్ వర్డ్, ఎంఎస్ ఎక్సెల్, ఎంఎస్ ఆఫీస్ సాఫ్ట్ వేర్, ఇంటర్నెట్, మెయిల్, సోషల్ మీడియా ప్లాట్ ఫాం ఉపయోగించడం తదితర వాటితో సహా ఆచరణాత్మకమైన శిక్షణ గ్రామీణ ప్రాంతాల్లోని యువతకు అందించడమే ఈ కార్యక్రమం లక్ష్యం అన్నారు.



అంగన్వాడీ కేంద్రాలపై విజిలెన్స్ దాడి



తిరుపతి సిటీ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ డిపార్ట్మెంట్ డీజీ డాక్టర్ ఎ.రవి శంకర్ ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా విజిలెన్స్ అధికారులు అంగన్వాడి సెంటర్స్ ను ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. అందులో భాగంగా తిరుపతి జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారి కె ఈశ్వర రెడ్డి ఆధ్వర్యంలో చైల్డ్ డెవలప్మెంట్ ప్రాజెక్ట్ అధికారులతో కలిసి తిరుపతి, చిత్తూరు జిల్లాలలోని నాలుగు అంగన్వాడి సెంటర్లను సోమవారం తనిఖీలు నిర్వహించారు. మెనూ ప్రకారం పిల్లలకు భోజనం అందిస్తున్నారా లేదా, బాలింతలకు, గర్భిణులకు ప్రభుత్వం నుంచి అందుతున్న పోషక ఆహార పదార్థాలను విధిగా అందించారా లేదా అనే విషయంపై తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కె ఈశ్వర రెడ్డి మాట్లాడుతూ తిరుపతి జిల్లా రేణిగుంట మండలంలోని పాంచాలి నగర్, వడమాలపేట మండలంలోని ఎ.వడ్డి పల్లి, చిత్తూరు జిల్లాలోని విజయపురం మండలం లోని కోసల నగరం, వెదురుకుప్పం మండలం గ్రామంలోని అంగన్వాడి కేంద్రాలను పరిశీలించామన్నారు. ఇపై తరచుగా ఇటువంటి తనిఖీలు చేపట్టి, నివేదికలను ప్రభుత్వానికి పంపిస్తామని తెలిపారు.

15న దండిమార్చ్ విగ్రహాలు ప్రారంభం : కమిషనర్



విగ్రహాలను పరిశీలిస్తున్న కమిషనర్ హరిత

తిరుపతి టౌన్ : భారత దేశానికి స్వాతంత్ర్యం సాధించిన వారి చరిత్ర భవిష్యత్ తరాలకు కళ్ళకు కట్టినట్లు తెలిసేలా దండి మార్చ్ విగ్రహాలు ఏర్పాటు చేస్తున్నామని నగరపాలక సంస్థ కమిషనర్ హరిత అన్నారు. నగరపాలక సంస్థ పరిధిలోని ముత్యాలరెడ్డి పల్లి కూడలి వద్ద ఏర్పాటు చేస్తున్న దండి మార్చ్ విగ్రహాలను సోమవారం ఉదయం కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ప్రజల సౌకర్యార్థం అనేక అభివద్ధి పనులు చేస్తున్నామన్నారు. అందులో భాగంగానే 13 మాస్టర్ ప్లాన్ రోడ్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. అన్ని పనులు పూర్తి చేసి ఆగస్ట్15 స్వాతంత్ర దినోత్సవం రోజున దండి మార్చ్ విగ్రహాలను ప్రారంభిస్తామని అన్నారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్, మునిసిపల్ ఇంజినీర్ చంద్రశేఖర్, డి.ఈ. మహేష్ ఉన్నారు.

శ్రీనివాస సేతుపై డెక్ స్లాబ్ పనులు పరిశీలన

తిరుపతి టౌన్ : నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని రైల్వే ఓవర్ బ్రిడ్జి వద్ద శ్రీనివాస సేతు పై జరుగుతున్న డెక్ స్లాబ్ పనులను సోమవారం ఉదయం కమిషనర్ హరిత పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ శ్రీనివాస సేతు నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్నాయని అన్నారు. చివరి మూడు సెగ్మెంట్లను అమర్చితే పనులు పూర్తి అవుతాయని అన్నారు. ఇటీవల పిల్లర్లపై అమర్చిన గడ్డర్లపై స్లాబ్ వేసే పనులను సోమవారం పరిశీలించామని అన్నారు. నెల రోజుల్లోపు అన్ని పనులు పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేస్తున్నామని అన్నారు. శ్రీనివాస సేతు ప్రారంభిస్తే నగరంలో ప్రజలకు, భక్తులకు ట్రాఫిక్ కష్టాలు పూర్తి స్థాయిలో తగ్గిపోతాయని అన్నారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్, మునిసిపల్ ఇంజినీర్ చంద్రశేఖర్, ఏఈకాం ప్రతినిధి బాలాజీ, తదితరులు ఉన్నారు.

చేనేతల సమస్యలు పరిష్కరించాలి



తిరుపతి(మంగళం): రాష్ట్రవ్యాప్తంగా చేనేతలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని అన్నమయ్య జిల్లా పీలేరు మండల కేంద్రంలో ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు సుంకర చిన్నరెడ్డిబాబు ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం నుండి క్రాస్ రోడ్డు వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సుంకర చిన్నరెడ్డిబాబు మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో విదేశీ వస్త్ర బహిష్కరణ స్వదేశీ ఉద్యమం అనే నినాదంతో దేశ ఐక్యతకు చేనేతలు ఎంతగానో పోరాటం చేశారని, నేడు దేశవ్యాప్తంగా చేనేతలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన చొరవ చూపడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం అధికారికి వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో ఐక్యవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిబ్బాల వెంకటరమణ, రాష్ట్ర అధికార ప్రతినిధి పోలిశెట్టి సురేంద్ర, రాష్ట్ర కోశాధికారి సిబ్బాల రమేష్ పాల్గొన్నారు.

భూమన కరుణాకర్‌రెడ్డికి సత్కారం



తిరుపతి(మంగళం): తిరుమల తిరుపతి దేవస్థానం అధ్యక్షులుగా నియమితులైన తిరుపతి శాసనసభ్యులు భూమన కరుణాకర్ రెడ్డిని వైసిపి యువజన విభాగం నాయకులు మల్లం రవిచందర్, మోహన్ బాబు ఆధ్వర్యంలో సోమవారం గజమాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా తిరుపతి నగర పరిధిలోని ముత్యాలరెడ్డిపల్లి నుండి భూమన నివాసం వరకు 500 మంది యువకులతో బైక్ ర్యాలీని నిర్వహించారు. టీటీడీ చైర్మన్ గా భూమన కరుణాకర్‌రెడ్డిని నియమించినందుకు సీఎం జగన్మోహన్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పవన్, భువన్, సాయి పాల్గొన్నారు.

డాక్టర్ హరికృష్ణ సేవలు ప్రశంసనీయం



తిరుపతి టౌన్: నగరంలో పరిశుభ్రత చర్యలు చేపట్టడంలో డాక్టర్ హరికృష్ణ సేవలు ప్రశంసనీయం అని నగరపాలక సంస్థ కమిషనర్ హరిత అన్నారు. నగరపాలక సంస్థ హెల్త్ ఆఫీసర్ గా విధులు నిర్వహిస్తూ బదిలీపై వెళుతున్న డాక్టర్ హరికృష్ణకు వీడ్కోలు, నూతన హెల్త్ ఆఫీసర్ గా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ యువ అవినాష్ రెడ్డికి ఆహ్వాన కార్యక్రమం సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ హరిత మాట్లాడుతూ రెండున్నర సంవత్సరాల కాలంలో కరోనా సమయంలో ఎవరూ బయటకు రాని సమయంలో హెల్త్ ఆఫీసర్‌గా హరికృష్ణ అన్ని తానై సిబ్బందితో కలిసి ప్రజలకు ఎనలేని సేవలు అందించారన్నారు. అదనపు కమిషనర్ సునీత, ఉప కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, మునిసిపల్ ఇంజనీర్లు చంద్రశేఖర్, వెంకట్రామి రెడ్డి, రెవెన్యూ ఆఫీసర్ సేతు మాధవ్, కే.ఎల్.వర్మ ఉన్నారు.

తిరుపతిలో శాంతియుత ర్యాలీ

ప్రజాశక్తి-తిరుపతి సిటీ: మణిపూర్‌లో జరుగుతున్న అల్లర్లను ఖండిస్తూ తిరుపతి చర్చిల ప్రతినిధులు తిరుపతి నగరంలో సోమవారం సాయంత్రం శాంతియుత ర్యాలీ నిర్వహించారు. వెస్ట్ మిషన్ కాంపౌండ్ నుండి టౌన్ క్లబ్, గాంధీ రోడ్డు, మీదుగామున్సిపల్ ఆఫీస్ వరకు ర్యాలీ సాగింది. ఈస్ట్ నూతన చర్చ్ రెవరెండ్ బెంజిమెన్ ప్రార్థనతో, ఆంధ్రప్రదేశ్ బిషప్ కౌన్సిల్ ఛైర్మన్ డాక్టర్ ప్రవీణ్ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో బెస్ట్ మిషన్ చర్చి రెవరెండ్ జాన్సన్, రఫీ హిందుస్తానీ, ఇషాక్ గౌస్ బాషా, రహమతుల్లా, దళిత నాయకులు పరమశివణ్ , ధన శేఖర్, పాస్టర్ ఆరులు అరుసు, రెవరెండ్ రాజేంద్రన్, పాస్టర్ పాల్ రాజ్, పాస్టర్ యేసు పాదం, జాన్ జ్యోతిరావు, శరత్‌చంద్ర, పూర్ణ, విజయ్ కుమార్ , మమత, దేవదానం తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రితో ఆదికేశవులునాయుడి కుమార్తె భేటీ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : టీటీడీ మాజీ ఛైర్మన్ ఆదికేశవులునాయుడు, చిత్తూరు మాజీ ఎమ్మెల్యే సత్యప్రభ దంపతుల కుమార్తె తేజేశ్వరి సోమవారం ఢిల్లీలో కేంద్రమంత్రి రాందాస్ అథోల్ ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె తిరుమలలో ఆనంద



నిలయం, అనంత స్వర్ణమయం గురించి చర్చించారు. కేంద్రమంత్రి రాందాస్ సానుకూలంగా స్పందించినట్లు తేజేశ్వరి చెప్పారు.

ఎస్వీయూ అభివృద్ధికి ఆచార్య గోవిందరాజులనాయుడు కృషి



ప్రజాశక్తి-క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ అభివృద్ధికి తొలి వీసీ ఆచార్య గోవిందరాజులనాయుడు ఎంతో కృషి చేశారని ఎస్వీయూ విసి ఆచార్య రాజారెడ్డి పేర్కొన్నారు. తొలి వీసీ ఆచార్య గోవిందరాజులు నాయుడు వర్ధంతి కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీలోని ఆచార్య గోవిందరాజుల నాయుడు విగ్రహానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు.

18న చలో విజయవాడ జయప్రదం చేయండి

ప్రజాశక్తి - క్యాంపస్ : రాష్ట్రవ్యాప్తంగా యూనివర్సిటీలో పని చేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, టైం స్కేల్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని ఆగష్టు18న చలో విజయవాడ జయప్రదం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగుల తిరుపతి జిల్లా జేఏసీ ఛైర్మన్ గండికోట నాగవెంకటేష్ పిలుపునిచ్చారు. తిరుపతి వ్యవసాయ కళాశాల ఆవరణలో కాంట్రాక్టు ఉద్యోగులు జనరల్ బాడీ సమావేశం జరిగింది. వ్యవసాయ కళాశాల కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు వరలక్ష్మి, రాకేష్, చంద్రమ్మ, గుణ, సాయి, సుబ్బు, మునిలక్ష్మి, సరస్వతి, చంద్ర, శివప్రసాద్, భువన తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికులకు పింఛను ఇవ్వాలి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : చేనేత కార్మికులకు 40 ఏళ్లు దాటిన వారికి పింఛను మంజూరు చేయాలని చేనేత కార్మిక నాయకులు గంజి మాధవయ్య పేర్కొన్నారు. సోమవారం చేనేత కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకొని రామకష్ణాపురం పంచాయతీలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో నూకల కష్ణయ్య, హరిబాబు, మునివాసులు, సభ్యులు పాల్గొన్నారు.


వైభవోపేతం.. ఆడికృత్తిక మహోత్సవం

రేపు శ్రీవల్లీ దేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామికి అభిషేకాలు



ప్రజాశక్తి-చిట్టమూరు: చిట్టమూరు మండలం మల్లాం గ్రామం (తిరుగుడుమల్లాం)లో వెలసిన శ్రీవల్లీ దేవసేన సమేత శ్రీ స్వయంభువు శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానంలో ఈనెల 9వ తేదీ నుంచి ఆడికత్తిక మహోత్సవాలు వైభవంగా జరుగుతాయని ఆలయ కమిటీ ఛైర్మన్ చిల్లకూరు సాయికుమార్‌రెడ్డి తెలిపారు. భక్తులు క్షేత్రానికి విచ్చేసి శ్రీ స్వామి అమ్మవార్లను దర్శించి తరించాలన్నారు. భారతదేశంలో ఎక్కడా లేనివిధంగా ఈ క్షేత్రంలో శ్రీ స్వామి వారు స్వయంభువుగా వెలిశారు. ఆడికత్తిక రోజున శ్రీ స్వామివారి జన్మ నక్షత్రం కావడంతో స్వామివారికి అత్యంత ప్రీతిపాత్రమైన పర్వదినంగా పరిగణిస్తారని తెలిపారు. ఉదయం సుప్రభాత సేవతో ప్రారంభమై 5 గంటలకు గణపతి హోమం, ఉదయం 6 గంటలకు శ్రీ స్వామివారి స్వయంభువు మూర్తికి మాత్రమే పరిమిత సంఖ్యలో అభిషేకాలు జరుగుతాయి. భక్తులు స్వామి వారిని ఉదయం 7 గంటల నుంచి దర్శనం చేసుకోవచ్చని వివరించారు. అష్టోత్తర కలశాభిషేకం, పంచామతాభిషేకం, పుష్పయాగం కార్యక్రమాలు శత:స్తంభ కళ్యాణ మండపంలో జరుగుతాయని.. కార్యక్రమంలో పాల్గొన దలిచిన భక్తులు దేవస్థానం వద్ద ముందుగానే టిక్కెట్ తీసుకుని, ఆడికృత్తిక నాడు నాలుగు పూలమాలలు ఐదు రకాల పండ్లు, వివిధ రకాల పుష్పాల తీసుకొచ్చి కార్యక్రమంలో పాల్గొనవచ్చని తెలిపారు.

శ్రీస్వామి వారికి అత్యంత ప్రీతిపాత్రమైన కావళ్లు మోసుకొచ్చిన భక్తులు వారికి నిర్దేశించిన ప్రదేశంలో కూర్చోవాలి. వారికి శ్రీ స్వామివారి దర్శనాన్ని ప్రత్యేకంగా కల్పించి ప్రసాదం ప్రత్యేకంగా అందించబడుతుంది. ఉదయం 6 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు.. సాయంత్రం 4 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు క్షేత్ర దర్శన వేళలు ఉంటాయి. శ్రీ స్వామి వారి ఆలయం లోపల ఫోటోలు తీయడం నేరం. అలా తీసినచో శిక్షార్హులు.



భక్తులు సాంప్రదాయ వస్త్రాలను ధరించి మాత్రమే ఈ ఆలయంలోకి రావాలి. ఆలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి. అష్టోత్తర కలశాభిషేకం, పంచా మృతాభిషేకం కార్యక్రమాల్లో పాల్గొనదలచిన భక్తులు ఫోన్ నెంబర్ 8179557634ను సంప్రదించి ముందుగా పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. అలాగే ఛైర్మన్‌తోపాటు పూజారి భానుప్రకాష్ ఆలయ చరిత్ర గురించి వివరించారు.

ఆలయ చరిత్ర

దేశంలో ఎక్కడా లేని విధంగా శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి స్వయంగా ఇక్కడ ఆలయంలో వెలిశారు. అత్యంత మహిమలతో భక్తుల కోర్కెలను తీర్చుతూ నిత్య అఖండ దీపారాధనతో వెలుగొందుతున్నారు. క్రీ.శ 630వ సంవత్సరంలో పాండురాజులచే దేవాలయం నిర్మించారు. ఆలయంలో స్వామివారి కైంకర్యం నిమిత్తం కుమారస్వామి అనే శిల్పి తన కుమారుడితో కలిసి శతస్తంభ మండపం నిర్మాణం చేపట్టారు. ఆ శతస్తంభ మండపంలో రామాయణం, మహాభారతం, భాగవతాది శిల్పాలను చెక్కి గుర్రాలతో రథాకారంగా అత్యద్భుతంగా నిర్మించారు. శ్రీ వల్లి దేవసేన సమేత స్వయంభు శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని దర్శించిన వారికి కుజదోష నివారణ జరిగి స్త్రీ పురుషుల వివాహం తక్షణమే జరుగుతుంది.

నిష్పక్షపాతంగా ఎన్నికల విధులు నిర్వర్తించాలి



ప్రజాశక్తి-తిరుపతి సిటీ: స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు పోలీస్ శాఖ సన్నద్ధంగా ఉండాలని.. నిష్పక్షపాతంగా విధులు నిర్వర్తించాలని జిల్లా ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు. సోమవారం తిరుపతి సైబర్‌సెల్ కాన్ఫరెన్స్ హాల్ నుండి జూమ్ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా పోలీసు అధికారులతో ఎస్పీ సమీక్షించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉందని.. పోలీసు అధికారులు, సిబ్బంది ఎన్నికల ప్రవర్తన నియమావళిని తప్పకుండా అమలు చేయాలని ఆదేశించారు. పోలీసుల ప్రవర్తన కారణంగా ఎలాంటి సమస్య ఉత్పన్నం కాకూడదని అధికారులను ఆదేశించారు. లైసెన్సు ఉన్న ఆయుధాలను వెంటనే ఎస్‌హెచ్‌వోలు డిపాజిట్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ వెంకటరావు పరిపాలన, కమాండ్ కంట్రోల్ డీఎస్పీ రవికుమార్, జిల్లా పోలీసు అధికారులు పాల్గొన్నారు.

స్పందనకు 61 ఫిర్యాదులు

తిరుపతి జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 61 ఫిర్యాదులు అందాయని ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో 'స్పందన' కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ నిర్వహించి ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. కార్యక్రమంలో ఏఎస్పీ, డీఎస్పీలు, సిఐలు పాల్గొన్నారు.

9న మహతిలో మనోవికాస శిక్షణ తరగతులు



ప్రజాశక్తి-తిరుపతి టౌన్: మెగా ఇంపాక్ట్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, ప్రముఖ మనోవికాస నిపుణుడు డాక్టర్ గంప నాగేశ్వరరావు మద్దతుతో, డాలర్స్ గ్రూప్ ఆధ్వర్యంలో ఈనెల 9, 10వ తేదీలలో స్థానిక మహతి ఆడిటోరియంలో మహా మేధావులు, 30 మంది ప్రముఖ విద్యావంతులచే చంద్రగిరి, తిరుపతి యువతీ యువకులకు వ్యక్తిత్వ వికాస శిక్షణ తరగతులను ఉచితంగా నిర్వహించనున్నట్లు డాలర్స్ గ్రూప్ ఆఫ్ ఛైర్మన్ డాక్టర్ సి దివాకర్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక ప్రకాశం రోడ్డులోని డాలర్స్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన పత్రిక సమావేశంలో ఆయన మాట్లాడారు. యువకులు చెడు మార్గాన్ని ఎంచుకోకుండా పేరు ప్రఖ్యాతలను కీర్తింప చేసేలా అభివద్ధి పథంలో వెళ్లాలని ఆకాంక్షించారు. డిగ్రీ, ఇంజినీరింగ్, ఇంటర్మీడియట్ చదివే యువతీ యువకులు ఈ కార్యక్రమంలో పాల్గొని విద్యావంతుల ప్రసంగంతో సానుకూల దక్పథంతో ముందుకు వెళ్లాలని కోరారు. కార్యక్రమానికి అయ్యే ఖర్చులను మొత్తం డాలర్స్ గ్రూప్ ఛైర్మన్ డాక్టర్ దివాకర్ రెడ్డి భరిస్తానని ముందుకు రావడం ఎంతో సంతోషదాయకమని తెలిపారు. ఇంపాక్ట్ ఫౌండేషన్ డైరెక్టర్ నారాయణ మాట్లాడుతూ యువతీ యువకులకు ఉచితంగా భోజన, నీటి వసతి ఏర్పాటు చేయబడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇంపాక్ట్ ఫౌండేషన్ ట్రైనర్ తహరునిస బేగం, సభ్యులు పాల్గొన్నారు.

'ఇంద్రధనస్సు' పోస్టర్ల ఆవిష్కరణ



ప్రజాశక్తి-తిరుపతి సిటీ: ఐదు సంవత్సరాల లోపు పిల్లలు, గర్భిణులకు టీకాలతో రోగ నిరోధక శక్తిని అందించాలనే లక్ష్యంతో మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా నిర్వహించడం జరిగిందని జిల్లా జాయింట్ కలెక్టర్ డి.కె బాలాజీ తెలిపారు. స్థానిక కలెక్టరేట్ ఆవరణలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో మిషన్ ఇంద్రధనస్సు పోస్టర్లను సోమవారం జాయింట్ కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో ఆరోగ్య సంరక్షణ సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి గర్భిణులు, ఐదేళ్లలోపు పిల్లలను గుర్తించి టీకాలు వేసి, వ్యాధి నిరోధక శక్తిని పెంపొందించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆగస్టు 7 నుండి 12, సెప్టెంబర్ 11 నుండి 16 వరకు, అక్టోబర్ 9 నుండి 14 వరకు ఈ కార్యక్రమాన్ని మూడు విడతలలో నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీహరి, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారిణి డాక్టర్ శాంత కుమారి, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిణి జయలక్ష్మి, అదనపుజిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి అరుణ సులోచన దేవి, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ రూప్ కుమార్, డీపీఎంవో డాక్టర్ శ్రీనివాసులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు టౌన్: ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై దృష్టి సారించాలని ఎంపీపీ మునివేలమ్మ సూచించారు. వేపగుంట సచివాలయంలో మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో వైద్య అధికారిణి డాక్టర్ కళ్యాణి, కె.రమేష్ బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా వెంటనే పూర్తి చేయాలి

ప్రజాశక్తి-గూడూరు: గూడూరు రెవెన్యూ డివిజనల్ అధికారి ఎం.కిరణ్ కుమార్ సోమవారం వెలుగు కార్యాలయంలో గూడూరు నియో జకవర్గం పరిధిలోని ఏఈఆర్‌వోలు, సూపర్వైజర్లు, బూత్ లెవల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఓటర్ జాబితా త్వరగా పూర్తి చేయాలన్నారు. సర్వేలు, ఓటరు జాబితాలో చేర్పులు, తొలగింపులు , పేర్లు, ఫోటోలు, సవరణలు పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహశీల్దారు గూడూరు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు, తహశీల్దారు లీలారాణి తదితరులు పాల్గొన్నారు.

బియ్యపు మధూ.. నీకు నేనే ఎక్కువ

- బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: 'బియ్యపు మధూ...! మీ స్థాయికి నేనే ఎక్కువ. చంద్రబాబునాయుడు, నారా లోకేష్ ఎందుకు రాజా..? నువ్వో కామెడీ కింగ్. ప్రెస్ మీట్‌లో గంటకు పైగా మంచి కాలక్షేపం ఇచ్చావు. నీవు ప్రెస్టేషన్‌తో మాట్లాడుతున్నావని బాగా అర్థమైంది. నీ పిచ్చి మాటలు ఇంకైనా ఆపు' అంటూ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదనరెడ్డిపై టీడీపీ శ్రీకాళహస్తి నియోజకవర్గం ఇన్‌ఛార్జి బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి వ్యంగ్యాస్త్రాలు సంధించారు. శ్రీకాళహస్తి పట్టణంలోని ఎన్టీఆర్ భవన్‌లో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. శ్రీకాళహస్తిలో చంద్రబాబునాయుడు సభ విజయవంతం కావడంతో బియ్యపు మధుకు వణుకు పుడుతోందన్నారు. ఆయనపై పోటీకి చంద్రబాబు, లోకేష్ రావాలని సవాల్ విసరడం హాస్యాస్పదమన్నారు. వారి స్థాయి తెలియకుండా బియ్యపు మధు మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. ప్రెస్టేషన్‌లో బియ్యపు మధు ఏవేవో మాట్లాడుతున్నారన్నారు. తమ కుటుంబంపై వ్యక్తిగత విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. తాను జన్మించక ముందు తన పెద్దలు సంపాదించిన ఆస్తి గురించి బియ్యపు మధు ఇప్పుడు మాట్లాడటం ఆయన అవివేకానికి నిదర్శనమన్నారు. కరోనా పేరుతో పరిశ్రమలు, విద్యా, వ్యాపార సంస్థల వద్ద బియ్యపు మధు ఎంత వసూలు చేశారో చెప్పాలన్నారు. తన చిన్నాన్న హరినాథరెడ్డిని తాను చంపానని 14నెలలు తరువాత చెబుతున్నావని... ఇంతకాలం నిద్ర పోయావా అని ప్రశ్నించారు. తొట్టంబేడు మండలంలో పాత బోర్లు మరమ్మతు చేయించి 'గంగ' నీటి కోసం రూ.1.10 కోట్లు ఖర్చు చేశానని చెప్పడం ఏమిటన్నారు. ఆ ఖర్చు రూ.5 లక్షలు దాటదన్నారు. బియ్యపు మధు చెప్పేవన్నీ అబద్దాలే అన్నారు. శ్రీకాళహస్తి ప్రజలు వెర్రి వారు కాదని తగిన సమయంలో బియ్యపు మధుకు బుద్ధి చెబుతారన్నారు. సమావేశంలో టీడీపీ నేతలు గాలి చలపతినాయుడు, విజయకుమార్, చెలికం పాపిరెడ్డి,తాటిపర్తి ఈశ్వరరెడ్డి, బొల్లినేని జగన్నాథం నాయుడు, రంగినేని చెంచయ్యనాయుడు పాల్గొన్నారు.

వైసీపీ అక్రమాలను ప్రశ్నిస్తే కేసులా?

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: వైసీపీ అక్రమాలను ప్రశ్నించినందుకు కేసులు పెడుతారా అని..రాష్ట్ర తెలుగు మహిళ ఐటీడీపీ అధికార ప్రతినిధి ఉండవల్లి అనూష ప్రశ్నించారు. సోమవారం ఆమె పుత్తూరు కోర్టుకు వాయిదాపై హాజరైన అనంతరం పుత్తూరులో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూ బకాసురులు అనే పేరుకు మంత్రి రోజా సరిగ్గా సరిపోతారని.. త్వరలో నగరి నియోజకవర్గ ఓటర్లు సరైన బుద్ధి చెబుతారన్నారు. మంత్రి రోజా నీతిమంతురాలు అయితే నాలుగేళ్లలో ఎంత అవినీతి చేయకపోతే కొండంత ఆస్తులు కూడబెట్టారని.. దీనికి సమాధానం చెప్పాలని అన్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ బీసీ సెల్ చిత్తూరు పార్లమెంటరీ అధ్యక్షులు షణ్ముగంరెడ్డి, ఏలుమలై రెడ్డి, శ్రీరామ్, నవీన్, సంతోష్, చిరంజీవి, మదన్, లక్ష్మీపతి, ఉమాశంకర్ రెడ్డి, మునిరెడ్డి, మునస్వామి పాల్గొన్నారు.

యువకుడి దారుణ హత్య




ప్రజాశక్తి-సత్యవేడు: ఓ యువకుడు దారుణహత్యకు గురైన సంఘటన సత్యవేడు మండలం పీవీ పురం పంచాయతీ కొత్త కండ్రిగ వద్ద సోమవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. సత్యవేడు మండలం రంగరాజగుంట గ్రామానికి చెందిన ఢిల్లీబాబు, నాగమ్మ దంపతుల కుమారుడు పి.ముని శేఖర్ (27) బంధువుల ఇంటికి వెళ్లి వస్తుండగా హత్యకు జరయ్యాడు. గతంలో వాలంటీర్ గా పనిచేసి ప్రస్తుతం శ్రీసిటీలోని ఓ పరిశ్రమలో పనిచేస్తున్నాడు. తన కుమారుడిని ఉద్దేశ పూర్వకంగానే హత్యచేశారని తల్లి దండ్రులు పోలీసుల వద్ద వాపోయారు.

బస్సు ఢీకొని వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: తడుకు పెట్రోలు బంకు వద్ద వడమాలపేట మండలం ఎస్‌బీఆర్‌పురం అంబేద్కర్ కాలనీకి చెందిన కప్పల రమేష్ ద్విచక్రవాహనంపై స్వగ్రామం వెళుతుండగా చెన్నై నుంచి తిరుపతికి వెళ్లే తమిళనాడు ఆర్టీసీ బస్సు ఢీకొంది. ప్రమాదంలో రమేష్ గాయాలతో బయటపడ్డాడు. 108 వాహనంలో పుత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స చేశారు. మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు తరలించారు. పుత్తూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాపు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తల మృతి

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని భార్యాభర్తలు మృతిచెందిన సంఘటన పుత్తూరులో సోమవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. మండల పరిధిలోని తొరూరు గ్రామానికి చెందిన



కృష్ణయ్య(75), భార్య నందకుమారి (65) సోమవారం సాయంత్రం ద్విచక్ర వాహనంపై పుత్తూరుకు బయలుదేరారు. బైపాస్ దాటు తుండగా అదే సమయంలో రేణిగుంట నుంచి నారాయణ వనం వెళుతున్న మరో ద్విచక్ర వాహనం ఢీకొంది. ప్రమాదంలో భార్యాభర్తలిద్దరూ మృతిచెందారు. మృత దేహాలను ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు.

చోరీ కేసులో ముద్దాయి అరెస్టు



ప్రజాశక్తి-కోట: కోట మండలంలోని పలు ప్రాంతాల్లో దొంగతనాలు చేసిన ముద్దాయిని మంగళవారం మధ్యాహ్నం విద్యానగర్ గ్రామ శివారులలో కోట ఎస్సై జి.పుల్లారావు అరెస్టు చేశారు. నెల్లూరు జిల్లా కొడవలూరు మండలం గండవరం గ్రామానికి చెందిన మల్లికార్జున్(42) ను అరెస్టు చేశారు. డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి ముద్దాయి నుంచి పలు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులకు డీఎస్పీ అభినందించారు.

అక్రమ గంజాయి పట్టివేత

ప్రజాశక్తి -గూడూరు : గూడూరు రెండో పట్టణం గాంధీనగర్‌లో గూడూరు సెబ్ టీం జరిపిన వాహనాల తనిఖీలలో గంజాయి కలిగిన ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి వారి నుండి 20 కేజీల గంజాయిని, వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

చెట్లు నరికివేతపై ఫిర్యాదు

ప్రజాశక్తి-గూడూరు: గూడూరు ఎస్‌కే ఆర్ డిగ్రీ కళాశాలలో దశాబ్దాల నాటి చెట్లను ఎటువంటి అనుమతులు లేకుండా నరికి అమ్ముకున్న కళాశాల ప్రిన్సిపల్, కొందరు అధ్యాపకులపై విచారణ చేసి చర్యలు



తీసుకోవాలని సోమవారం వినతిపత్రం అందించారు. పర్యావరణవేత్త మేకా శివకుమార్ యాదవ్, బీజేవైఎం తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి గిద్దలూరి మనోజ్ కుమార్, రిటైర్డ్ ఎస్ కే ఆర్ డిగ్రీ కాలేజ్ అధ్యాపకులు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.